బాధితుడికి అండగా నిలిచిన బీఆర్ఎస్

కన్నాయిగూడెం, జనవరి 23 : ప్రజా పాలన గ్రామ సభల్లో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ప్రజలు ఆత్మహత్య చేసుకుంటున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. గురువారం కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ సభలో అధికారుల ముందే రైతు కుమ్మరి నాగేశ్వర రావు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. బాధితుడైన దళిత రైతును కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేశారని, దీంతోనే మనస్తాపానికి గురై అధికారుల ముందే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రాజకీయ కక్షలతో అర్హులైన పేదల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. కాగా, గ్రామసభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించకపోవడంతోనే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. బుట్టాయిగూడెంలో సభను మధ్యాహ్నం నిర్వహించాల్సి ఉండగా ఉదయమే నిర్వహించారు. పోలీసులకు సమాచారం లేకపోవడంతో రాలేదు. పోలీసులు ఉంటే నాగేశ్వర్‌రావు పురుగులమందు తాగేవాడు కాదేమో అంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అధికారులు కావాలనే సమాచారం దాచి పెట్టారా? అనే విమర్శలు సైతం వినిపించాయి. గ్రామ సభ పూర్తయిన అరగంటకు పోలీసులు కాపాలా కోసం వచ్చారు. కాగా, గ్రామ సభలో కుమ్మరి నాగయ్య క్షణికావేశంలో పురుగులమందు తాగినట్లు తాహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వనిత తెలిపారు. .

ఇది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంగపేట జనవరి 23 : కాంగ్రెస్ పాలన ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలనేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని కమలాపురంలో వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా పాలన గ్రామ సభలను చూస్తే కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో అర్థమవుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారాలో గ్రామ సభలు నిర్వహించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. పథకాలు అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై బురద జల్లడం మాని, పరిపాలనపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో కమలాపురం అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్, బీఆర్‌టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎస్కే కుర్బాన్ ఆలీ, పబ్బోజు సత్యనారాయణచారి, పగడాల వెంకట్‌రెడ్డి, చల్లగురుగుల తిరుపతి, యలవర్తి శ్రీనివాసరావు, రఘు, సాంబయ్య, రాజేశ్, మల్లేశ్, హరీశ్, చందర్‌రావు, రాములు, సత్యం, అనిల్‌రెడ్డి, రాము, పద్మావతి, తిరుపతమ్మ, లక్ష్మి, కల్యాణి, అంజమ్మ, ఝాన్సీ, బీస్ సాంబయ్య పాల్గొన్నారు.

దృష్టి మళ్లించేందుకే గ్రామసభలు

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం, జనవరి 23 : ప్రజల్లో గందరగోళం సృష్టించి, దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభల పేరుతో పరేషాన్ చేస్తున్నదని బీఆర్ఎస్ ఏటూరునాగారం గ్రామ అధ్యక్షుడు ఖాజాపాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పథకాలు వచ్చిన వారు రానీ వారిని సభలకు పిలిచి పంచాయితీలు పెట్టిస్తూ వర్గాలుగా చీలుస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాపాలన సర్వే ప్రకారం లబ్ధిదారులకు పథకాలు అందచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సప్పిడి రాంనర్సయ్య, తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, గండపల్లి నర్సయ్య, బట్టు రమేశ్, కాళ్ల రామకృష్ణ, విజయ్, శ్రీరామ్, వావిలాల కిశోర్ పాల్గొన్నారు.

నేడు మల్లంపల్లి మండలం ఆవిర్భావం

ములుగురూరల్(మల్లంపల్లి), జనవరి 23 : ములుగు జిల్లాలో మరో నూతన మండలంగా మల్లంపల్లి ఆవిర్భవించనున్నది. జిల్లా ఏర్పడిన నాటి నుంచి మల్లంపల్లి వాసులు తమ ప్రాంతాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ నేటితో నెరవేరనున్నది. మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మండల కార్యాలయాలను శుక్రవారం ప్రారంభించనున్నారు. కొన్ని రోజులుగా తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయ భవనంలో ఎంపీడీవో కార్యాలయం, పీఏసీఎస్ భవనంలో తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభానికి ఏర్పాట్లను పూర్తి చేశారు.

రేగొండ : చిన్నాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాటారం : ఆదివారంపేట గ్రామ సభలో సబ్ కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

మొగుళ్లపల్లి : మొట్లపల్లి గ్రామ సభలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

మహదేవపూర్ : తమ పేర్లు రాలేదని సూరారం గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కొనసాగుతున్న నిలదీతల పర్వం

- మూడో రోజూ గ్రామసభల్లో అదే తీరు
- అధికారులతో ప్రజల వాగ్వాదం
- మౌనంగా వ్యవహరించిన అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, జనవరి 23 : ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పక్రియ కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలు మూడు రోజూ గురువారం గందరగోళంగా మారాయి. అర్హులైన వారి పేర్లు జాబితాలో రాక పోవడంతో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని సూరారం, ఎడపల్లి, రాపల్లికోట, కుదురుపల్లి గ్రామాల్లో నిర్వహించిన సభలో ఘర్షణ వాతావరణ నెలకొంది. సూరారం సభలో అర్హుల పేర్లు రాలేదని ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు మౌనంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభల్లో స్థానిక కాంగ్రెస్ నాయకుల జోక్యంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. కాంగ్రెస్ నాయకుల పెత్తనం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ప్రసాద్ , ఏవో సుప్రజ్యోతి, డీటీ కృష్ణ, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రఘు, ఏఈవో ధర్మేందర్ పాల్గొన్నారు. కాటారం మండలంలోని అంకుషాపూర్, బయ్యారం, ఆదివారంపేట, వీరాపూర్, ప్రతాపగిరి, విలాసాగర్ పంచాయతీల పరిధిలో గ్రామసభలు కొనసాగాయి. లబ్ధిదారుల జాబితా తయారీలో అవకతవకలు జరిగాయని ప్రజలు నిలదీశారు. ఆదివారంపేట జీపీలో జరిగిన గ్రామసభలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొనగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో నరేశ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న, ఆర్ఐ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. చిట్యాల మండలం నవాబుపేటలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లు రాలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. తప్పుడు తడకగా సర్వే నిర్వహించారని, ఈజీఎస్‌లో పనిచేయని కూలీలను లబ్ధిదారులుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో చేర్చారని ప్రశ్నించారు. రీ సర్వే జరిపించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఎస్ఐ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. పలిమెల మండలంలోని లెంకలగడ్డ, సర్వాయిపేట గ్రామాల్లో సభల్లో కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని స్థానిక ప్రజలు

మంగపేట : కమలాపురంలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

గోవిందరావుపేట : పస్రాలో శాపనార్థాలు పెడుతున్న మహిళ

ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాశ్ రెడ్డి,జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, భూపాలపల్లి మున్సిపల్ పరిధి 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన వార్డు సభకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. అలాగే, గణపురం మండలంలోని కొండాపురం, ధర్మారావుపేట, చిట్యాల మండలం గోపాలపూర్, గోరికొత్తపల్లి మండలం చిన్నాపురం, టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో కూడా ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొన్నారు. మొగుళ్లపల్లి మండలంలోని ఆకినపల్లి, అంకుషాపూర్, గుడిపహాడ్, ఇస్సిపేట, మొట్లపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించగా ఇస్సిపేటలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆకినపల్లిలో తిరిగి సర్వే నిర్వహించాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మండల స్పెషల్ ఆఫీసర్ సునీత, తహసిల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్ పాల్గొన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధి 16, 17, 22వ వార్డులు, మండలంలోని నందిగామ, వజినపల్లి, పెద్దపూర్, సుబ్బక్కపల్లి, కొంపెల్లి, కొంపెల్లి తండా, నాగారం గ్రామాల్లో వార్డు, గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ అశోక్ కుమార్, కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మండలంలో రొయ్యూరు, రామన్నగూడెం, ముల్లకట్టలో గ్రామ సభలు నిర్వహించగా, రొయ్యూరులో ఆత్మీయ భరోసాపై కూలీలు నిప్పులు చెరిగారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంటు తప్పుడు నివేదిక ఇచ్చారని వచ్చిన పేర్లల్లో ఒకే వర్గానికి చెందిన వారివి ఉన్నాయని సర్వే కరెక్టుగా చేస్తే 26 మంది పేర్లు మాత్రమే ఎలా వస్తాయంటూ గడబోయిన రంజిత్, గడబోయిన రంజిత్, బెడిక రమేశ్, గడ్డం నర్సింహులు ప్రశ్నించారు. అలాగే, రామన్నగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు స్టేజీ వద్దకు వెళ్లి మొరపెట్టుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఏఎస్సీ శివం ఉపాధ్యాయ, మండల ప్రత్యేకాధికారి రాంపతి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, ఏవో వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రవీందర్ పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలం పస్రాలో కార్యదర్శి శ్వేత అధ్యతన జరిగిన గ్రామ సభలో రసాభస చోటు చేసుకుంది. లబ్ధిదారుల లిస్టులను చదువుతున్న క్రమంలో ప్రజలు ఒక్కసారిగా లేచి అధికారులపై మండిపడ్డారు. ఓ మహిళ శాపనార్థాలు పెడుతూ నిలదీసింది. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్ రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, గోవిందరావుపేటలో జరిగిన గ్రామసభలో ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో గతంలో వచ్చిన లబ్ధిదారులకే మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. మండల పరిధిలోని నూగూరు, సూరవీడు, ఉప్పేడు వీరాపురం జీపీలో సభలను నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు పాల్గొన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల, మదనపల్లి, మహ్మద్ గౌస్‌పల్లి, పంచోత్కులపల్లి, పొట్లాపూర్, రాయినిగూడెం, రామచంద్రాపురం, బంజరుపల్లిలో గ్రామ సభలను నిర్వహించారు. గతంలో దర ఖాస్తు చేసుకున్న వారితో పాటు అర్హులైన తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. మదనపల్లిలో గ్రామ సభ రసభసగా కొనసాగింది. కాంగ్రెస్ కార్యకర్తలు, అనుచరుల పేర్లు వచ్చాయని, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉన్న వారి పేర్లు రాలేదని ప్రశ్నించారు. మంగపేట మండలంలోని కమలాపురం, బుచ్చంపేట, రమణక్కపేట, తిమ్మంపేట, అకినేపల్లి మల్లారంలో గ్రామ సభలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ కమలాపురంలో అర్హుల పేర్లు జాబితాలో రాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు పాల్గొన్నారు.

వార్డు సభ సాక్షిగా ఆడబిడ్డకు అవమానం

సభలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ మేకల రజితా మల్లేశ్

కృష్ణ కాలనీ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వార్డు సభ సాక్షిగా ఆడబిడ్డకు అవమానం జరిగింది. వివరాల్లోకి వెళితే.. 23వ వార్డులో గురువారం సభ ఉంటుందని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ అంతకు ముందే స్థానిక కౌన్సిలర్ మేకల రజితా మల్లేశ్‌కు చెప్పారు. అయితే, ఆమె ప్రజలకు అనుకూలంగా ఉండేలా స్థలాన్ని ఎంపిక చేసి కమిషనర్‌కు చెప్పారు. అంతేకాకుండా వార్డులోని ప్రజలందరికీ ఇంటింటికీ తిరిగి పాత రైజింగ్ సన్ పాఠశాల ఆవరణలో సభ ఉంటుందని సమాచారం కూడా ఇచ్చారు. తీరా సభ జరిగే ఉదయం ఆ స్థలం కాదని, 23వ వార్డుకు చెందిన ఓ కాంగ్రెస్ కార్యకర్త ఇంటి వద్ద నిర్వహిస్తున్నామని కమిషనర్ తనకు సమాచారం ఇచ్చారని కౌన్సిలర్ వాపోయారు. స్థలం ఎంపిక చేసి కమిషనర్‌కు, ప్రజలకు సమాచారం ఇచ్చిన తర్వాత కూడా మార్చడం ఏంటని ఆమె ప్రశ్నించారు. కొంత మంది ప్రజలకు ఈ స్థలం తెలియదని, అలాగే, తన 23వ వార్డులో రూ.29 లక్షల అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారు కానీ, పనులు ప్రారంభించలేదని కమిషనర్‌ను కౌన్సిలర్ ప్రశ్నిస్తుండగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలగజేసుకొని అధికారులు సూచించిన స్థలాల్లోనే వార్డు సభలు నిర్వహిస్తారని, అధికారులదే నిర్ణయమని తెగేసి చెప్పడంతో కౌన్సిలర్ రజిత కూర్చుంది. అనంతరం కమిషనర్ రాజేశ్వర్ అధ్యక్షతన సభ జరుగుతుండగా మొదట అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడిన తర్వాత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో మాట్లాడించారు. అక్కడే కూర్చున్న వార్డు కౌన్సిలర్ మేకల రజిత మాట్లాడేందుకు కనీసం మైక్ ఇవ్వకుండా అధికారులు అవమానించారు. ఎమ్మెల్యే సభ నుంచి వెళ్లిపోయిన తర్వాత కౌన్సిలర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ చేతుల్లో కీలుబొమ్మలుగా తయారయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అయినందునే తనకు మైకు ఇవ్వలేదని, తాను సూచించిన చోట సభ నిర్వహించలేదన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని, తన వార్డులో ఇప్పటివరకు పనులు ప్రారంభించడం లేదన్నారు. అభివృద్ధి పనుల గురించి ఇప్పుడు మాట్లాడవద్దని చెప్పిన ఎమ్మెల్యే తన గణపురంలో చేసిన అభివృద్ధి గురించి ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు.

చిట్యాల : నవాబుపేటలో నిలదీస్తున్న గ్రామస్తులు

పలిమెల : అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

వెంకటాపురం(నూగూరు) : నిలదీస్తున్న గ్రామస్తులు

ఏటూరునాగారం : రొయ్యూరులో పోలీసుల పహారా

నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 23 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ దవాఖానల్లో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ అన్నారు. గురువారం భూపాలపల్లిలోని యోధా సూపర్ స్పెషాలిటీ, దేవ్ మల్టీ స్పెషాలిటీ దవాఖానలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లోని అల్ట్రా సౌండ్ మిషన్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, బయో మెడికల్ వేస్ట్ రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఫైర్ పత్రాలను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అనుమతి పత్రాలు, పేషెంట్స్‌కి అందిస్తున్న సేవలు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలు గురించి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ లేని దవాఖానలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవోఎంసీహెచ్ డాక్టర్ శ్రీదేవి, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

ములుగురూరల్, జనవరి 23 : హై రిస్క్ ప్రాంతాల్లో ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాలని ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల ఐసీటీసీ కౌన్సిలర్లు, లింకు వర్కర్లు, ఎన్జీవోస్‌ల్లో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఏఆర్టీ మందులను రెగ్యులర్‌గా వాడేలా చూడాలన్నారు. సమావేశంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా ఎయిడ్స్, టీబీ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, ఇన్‌చార్జి డెమో సంపత్, జ్యోతి, సారయ్య, సాయి పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడితే చర్యలు

వెంకటాపురం(నూగూరు)/వాజేడు, జనవరి 23 : అటవీ జంతువులను వేటాడితే చర్యలు తీసుకుంటామని సీఐ బండారి కుమార్ అన్నారు. మండలంలోని శాంతినగర్‌లో గురువారం సాయంత్రం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడవి జంతువులను వేటాడేందుకు ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే, పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధి భువనపల్లి గ్రామంలో ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అవగాహన కల్పించారు.

సొంత మండలంపైనే ఎమ్మెల్యేకు ప్రేమ

- రూ.4కోట్ల మున్సిపల్ నిధులతో గణపురంలో అభివృద్ధి పనులు
- దమ్ముంటే కొత్త నిధులు తెచ్చుకోవాలి..
- భూపాలపల్లి పట్టణంపై ఎమ్మెల్యే చిన్నచూపు
- విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి

మాట్లాడుతున్న సెగ్గం వెంకటరాణీ సిద్ధు, హరీశ్‌రెడ్డి

కృష్ణ కాలనీ, జనవరి 23 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తన సొంత మండలమైన గణపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాడని, ఇతర ప్రాంతాలను పట్టించుకోవడం లేదని భూపాలపల్లి మున్సిపలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము పదవీ బాధ్యతలు చేపట్టిన ఐదేళ్లలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతో రూ. 310 కోట్ల నిధులతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అంబేద్కర్ సెంటర్ నుంచి కేటీకే- 2 ఇంక్లైన్ వరకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.4 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నిధుల నుండి రూ. 6 కోట్లు మొత్తం రూ.10 కోట్ల విధులను కేటాయించి, నాలుగు లైన్ల రోడ్లు, డివైడరు, సైడ్ కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలోనే 40 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికార బలంతో ఈ పనులను ప్రారంభించకుండా అధికారులను తప్పుదోవ పట్టించి, సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్ల టెండర్ రద్దు చేయించారని ఆరోపించారు. అలాగే, 2023-24 సంవత్సరానికి సంబంధించిన నిధులు రూ.2 కోట్లు, మొత్తం రూ.6 కోట్లు తన సొంత మండలంలోని గణపురం చెరువు సుందరీకరణకు తీసుకువెళ్లాడన్నారు. ఎమ్మెల్యేకు సొంత మండలం గణపురం మీద ఉన్న శ్రద్ధ భూపాలపల్లి పట్టణంపై లేదన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం ప్రారంభించిన రోడ్డు పనుల నిధులను సొంత మండలానికి తరలించడం సిగ్గుచేటన్నారు. ఆయనకు దమ్ముంటే సీఎంతో మాట్లాడి కొత్తగా నిధులు తెచ్చుకొని సొంత మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణ పనుల మధ్యలోనే ఆగిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే బ్లాక్ మెయిల్ చేస్తూ, కమీషన్లకు కక్కుర్తి పడి, గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను తిరిగి ప్రారంభిస్తూ, కొత్త కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాడని, బీఆర్ఎస్‌లోనే ఉన్న వారి పనులను పూర్తిగా పక్కకు పెట్టి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. తక్షణమే మున్సిపాలిటీకి సంబంధించిన రూ.4 కోట్ల నిధులను తిరిగి తెచ్చి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మేకల రజిత, బానోత్ రజిత, ఆకుదారి మమత, ఎడ్ల మౌనిక, బద్ది సమ్మయ్య కోఆప్షన్ సభ్యులు వజ్రామణి, దొంగల ఐలయ్య, బీఆర్ఎస్ నాయకులు బీబీ చారి, యుగేంధ్రాచారి, శ్రీకాంత్ పటేల్, రాకేశ్, మనోహర్, సతీశ్, శ్రీరామ్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

ములుగు రూరల్, జనవరి 23 : విద్యుత్‌షాక్‌తో మహిళా రైతు మృతిచెందిన సంఘటన ములుగు మండలం అబ్బాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాకారం గ్రామానికి చెందిన పూజారి రజిత(40) భర్త రమేశ్‌తో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అబ్బాపురంలో కౌలుకు తీసుకొని మక్కజొన్న సాగు చేశారు. అయితే అడవి పందుల నుంచి మక్కజొన్నను కాపాడుకునేందుకు రమేశ్ ఆ చేను చుట్టూ బైండింగ్ వైర్ అమర్చాడు. రాత్రివేళలో కరెంట్ సరఫరా ఇచ్చి ఉదయం తీసివేసేవాడు. గురువారం ఉదయం పంట వద్దకు వెళ్లిన రజిత, భర్త బైండింగ్ తీగలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉంటాడని భావించి నీళ్లు పారిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై బైండింగ్ తీగపై పడిపోయింది. చుట్టుపక్కల వారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రజిత మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆమె కుమార్తె, భర్త, బంధువులు గుండెలవిసేలా రోదించారు. ప్రమాదం జరిగిన తీరును ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, రజిత మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి : నాగజ్యోతి

రజిత కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

లైన్‌మన్‌కు గాయాలు..

ములుగురూరల్, జనవరి 23 : విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలైన ఘటన జాకారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. అబ్బాపూర్ గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ రాస రమేశ్ జాకారం ఫీడర్‌లో సమస్య ఉండగా ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కొట్టి కిందపడిపోయాడు. దీంతో రమేశ్ తల, తొడ, మోచేతి భాగాలు కాలిపోయాయి. తోడుగా వెళ్లిన జూనియర్ లైన్‌మన్ వేణు కింద పడుతున్న అతడిని పట్టుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. రమేశ్‌ను ములుగు